క్లుప్తంగా

షిప్‌యార్డ్ కార్మికులకు బ్యాడ్మింటన్ పోటీలు



పోటీలో తలపడుతున్న షిప్‌యార్డ్ కార్మికులు

మల్కాపురం: మే డేను పురస్కరించుకుని షిప్‌యార్డ్ సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. షిప్‌యార్డ్‌లోని వివిధ విభాగాలలో పని చేస్తున్న కార్మికులకు స్థానిక ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జరుగుతున్న పోటీల్లో 10 జట్లు పాల్గొంటున్నాయి. శనివారం వరకు పోటీలు ఉంటాయని, విజేతలకు మే డే వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఏయూ వీసీని కలిసిన జియ్యాని



వీసీ ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూలోని వీసీ చాంబర్‌లో ఆయన్ను కలిసి, వర్సిటీలోని మౌలిక సదుపాయాలపై చర్చించారు.

ఆదిత్య విద్యార్థులకు క్యాంపస్ కొలువులు



ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గోపాలపట్నం: స్థానిక ఆదిత్య కళాశాల విద్యార్థులు ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ సంస్థలో క్యాంపస్ కొలువులు సాధించారు. సంస్థ బెంగళూరు బ్రాంచ్ ప్రతినిధులు కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. వీరు వార్షిక వేతనంగా రూ.5.25లక్షలు పొందుతారన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

వైభవంగా రాసాలమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న దామా సుబ్బారావు దంపతులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌కాలనీలో రాసాలమ్మ వారి పండగ మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సీతానగరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 66 మంది విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. కణితి దుర్గాప్రసాద్ 6వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పాల్గొన్నారు. దుర్గాప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పులి వెంకటరమణారెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా?

- భూగర్భ పైపులైన్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం
- దాదాపు పది రోజులుగా సాగుతున్న తవ్వకాలు
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహన చోదకులు



శ్రీహరిపురం వద్ద భూగర్భ పైపులైన్ కోసం తవ్విన గోతులు

మల్కాపురం : ఇండియన్ కోస్టుగార్డు ప్రధాన కార్యాలయం నీటి అవసరాలకు, కోస్టుగార్డు ఉద్యోగుల క్వార్టర్స్‌కు అవసరమైన నీరు సరఫరా చేసేందుకు 9 కిలోమీటర్ల దూరం, సుమారు రూ. 9 కోట్ల వ్యయంతో భూగర్భ పైపులైన్ నిర్మాణ పనులు గత పది రోజుల నుండి జరుగుతున్నాయి. దీనిలో భాగంగా కోస్ట్‌గార్డు కార్యాలయం నుండి మల్కాపురం, ఆర్‌కే పురం, శ్రీహరిపురం మీదుగా గోతులు తవ్వుతున్నారు. రోడ్డు మధ్యలో గోతులు తవ్వటంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతే కాకుండా తవ్విన గోతులను సరిగ్గా పూడ్చకపోవటంతో రోడ్డు మధ్య మట్టిదిబ్బలు కొండల మాదిరి పేరుకుపోయి కనిపిస్తున్నాయి. దీంతో భారీ వాహనాల మాట దేముడెరుగు.. ద్విచక్ర వాహనాలు, పాదచారులు కూడా రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన సేవా మార్గంలో ఇలాంటి పనులు చేసేటప్పుడు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. కానీ అలాంటి చర్యలు చేపట్టలేదు. రోడ్డు మధ్య గోతులు తవ్వటం, వాటిని సరిగ్గా పూడ్చకపోవటం, మట్టి దిబ్బలను రోడ్డు మధ్యలో నిర్లక్ష్యంగా వదిలేయడంతో.. అసలే రాత్రిళ్లు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఎక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని అంతా ఆందోళన పడుతున్నారు. అధికారులు ఈ సమస్యపై స్పందించాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

జగన్ అంటే ఓ నమ్మకం

- మాటిస్తే తప్పక చేసే నైజం ఆయనది
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం : పేదల బతుకుల్లో చీకటిని.. ఆర్థిక ఇబ్బందులను జగన్ అనే వెలుగు తరిమేసిందని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు శ్రీహరిపురంలోని పాత రామాలయం వీధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కరోనా ఫస్ట్‌వేవ్‌లో నగరంలో గానీ, రాష్ట్రంలో గానీ అందరూ తలుపులు బిగించుకుని ఇళ్లల్లో ఉండిపోయారన్నారు. ఆ సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు కరోనా రోగులకు అవసరమైన సేవలతో పాటు, ఆ సమయంలో పలువురికి ప్రభుత్వ పథకాలను అందించారన్నారు. దేశంలో, ఏ రాష్ట్రంలో అయినా ఇలాంటి సేవలు అందాయా అని ప్రశ్నించారు. తనను నమ్ముకున్న ప్రజలకు ఏమీ జరక్కుండా ఉండాలనే ఆలోచనతో సీఎం జగన్ అప్పుడు 24 గంటలు పని చేశారన్నారు. అందుకే ఆయన చిత్రం పేదల ఇళ్లల్లోనూ, వారి గుండెల్లోనూ నిలిచిపోయిందన్నారు. గత టీడీపీ పాలనలో హుద్‌హుద్ వస్తే, అప్పుడు దాతలిచ్చిన చందాలు మింగేసిన ఘనత వారిదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో అంతా జగన్ వెంట నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, ధర్మాల వేణుగోపాలరెడ్డి, పొడుగు రాజు, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్లు చుక్క వరలక్ష్మి, తోనంగి వెంకటరమణియాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుండి పాత రామాలయం మీదుగా గుల్లలపాలెం వరకు సుమారు రూ. 15 లక్షల వ్యయంతో వేసిన సీసీ రోడ్డును ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు.

ముగిసిన ముత్యమాంబ అమ్మవారి జాతర



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం కూడలిలో వెలసిన ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ముగిశాయి. అమ్మవారిని శాకాంబరీగా అలంకరించారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముత్యమాంబను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి వెంకటరావు, భీశెట్టి వీరుబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 2వేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం



సర్టిఫికెట్లు అందుకున్న పారిశుధ్య కార్మికులతో బ్రహ్మకుమారి సింధు

మల్కాపురం: కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు ప్రశంసనీయమని ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ శ్రీహరిపురం శాఖ నిర్వాహకురాలు సింధు అన్నారు. బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను గురువారం సత్కరించారు. 60వ వార్డు గుల్లలపాలెం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆ ప్రాంత పారిశుధ్య కార్మికులను శాలువలతో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి తెలుగుదేశం కాలనీలో కొన్ని సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న లో ఓల్టేజ్ విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీలో ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు గురువారం ప్రారంభించారు. కాలనీలో ఓల్టేజి సమస్య కారణంగా చాలా గృహాల్లో ఎలక్ట్రిక్ పరికరాలు కాలిపోయి, నష్టం వాటిల్లింది. దీంతో గ్రామాభివృద్ధి సంఘం నాయకులు సమస్యను కార్పొరేటర్ లక్ష్మణరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దాడ ప్రసాద్, రామకృష్ణ, రమణ, దుర్గ, నక్కా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి శాంతి ధామం నూతన కార్యవర్గం



ఆలయంలో కొత్త కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామం ఆలయ కమిటీ చైర్మన్‌గా నక్కా లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా కొండ శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా పల్లి సత్యనారాయణ, జాయింట్ ట్రెజరర్‌గా బుగిడి రామకృష్ణ, ముఖ్య సలహాదారుగా వైవీ రమణ, సలహాదారుగా సత్యంబాబు ఎన్నికయ్యారు.

సమతానగర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సమతానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా బెవర సత్యనారాయణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బుద్ధపు ధర్మారెడ్డి, కోశాధికారిగా చింతల కిశోర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొర్రా హిమంతరావు, గౌరవాధ్యక్షునిగా వై.మన్మథరావు, జాయింట్ సెక్రటరీగా డొప్ప అప్పలనాయుడు, జాయింట్ ట్రెజరర్‌గా ఎండీ ఖాజా ఎన్నికయ్యారు.

పైప్‌లైన్ పగిలి.. తాగునీరు వృథా



ఐటీఐ జంక్షన్‌లోని బీఆర్‌టీఎస్ దారిలో పగిలిన పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాటిపూడి నీరు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలో గురువారం రాత్రి తాటిపూడి పైప్‌లైన్ పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతోంది. లీకేజీ నుంచి భారీగా నీరు ప్రవహించడంతో భవానీగార్డెన్, సుంకరపేట సమీప కాలనీలు, రోడ్లు, డ్రైనేజీలు నీట మునిగాయి. బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో అడుగులోతు నీరు ప్రవహించడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా భగీరథ జయంతి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో భగీరథ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ వేడుకల్లో పాల్గొని, భగీరథుని విగ్రహానికి పూలమాలలు వేశారు. బీసీ సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేవీ-1లో వార్షికోత్సవ సందడి



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న కమాండర్ మీనాకుమారి, ఇతర ఉపాధ్యాయులు



ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసం

సింధియా: మల్కాపురం నౌసేనాబాగ్ వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయం-1 వార్షిక వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండర్ మీనాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటి సాధనకు కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం క్రీడా పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కమాండర్ కె.వి.ఎస్.కౌశిక్, ప్రిన్సిపాల్ ఎస్.హెచ్.ఎస్.కె.దాస్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు మోటారు కుట్టుమిషన్ల పంపిణీ

- రోటరీ ఫౌండేషన్ వితరణ



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందించిన రోటరీ ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: రోటరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం కుట్టుమిషన్లు అందజేశారు. వృత్తి విద్యా శిక్షణలో భాగంగా రోటరీ ఫౌండేషన్ గ్లోబల్ గ్రాంట్స్ ద్వారా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో మహిళలకు 3 నెలల పాటు కుట్టుపనిలో శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 22 మంది మహిళలకు గురువారం పంచవటి కమ్యూనిటీ హాల్లో రోటరీ ఫౌండేషన్ పూర్వ గవర్నర్, ప్రాజెక్ట్ చైర్మన్ ఎం.జగదీశ్వరరావు సర్టిఫికెట్లతో పాటు మోటారు కుట్టు మిషన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని 6 సెంటర్లలో 12 షిఫ్టుల్లో 261 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చిన, మిషన్లు అందించామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారికి బ్యాంక్ రుణాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వారికి అవుట్ సోర్సింగ్ ద్వారా వ్యాపార అవకాశాలను కల్పించి ఉపాధి కల్పించేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సీహెచ్.రామలింగరాజు మాట్లాడుతూ గత బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో కొందరికి అడ్వాన్స్‌డ్ శిక్షణను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్లు అప్పలనాయుడు, ఏపీవో మనోహర్, ట్రైనర్ జగదీశ్వరి, పోవా కార్యదర్శి రామ్మోహనరావు, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

అమృతరావు స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమ నేత అమృతరావు స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 805వ రోజు గురువారం ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ముందుగా ఉక్కు పోరాట యోధుడు దివంగత తమనంపల్లి అమృతరావు వర్ధంతిని పురస్కరించుకుని దీక్షా శిబిరం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని, లేకపోతే పోరాటాల ద్వారానే ప్రైవేటీకరణ అంశానికి తెరపడేలా చేసి కేంద్రానికి తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు కార్మికులు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా ఏయూ గ్రంథాలయ సేవలు

- వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- నూతన సాఫ్ట్‌వేర్ సోల్ 3.0 ప్రారంభం



సోల్ 3.0ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయ సేవలు మరింత సరళతరం, సులభతరం చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గ్రంథాలయంలో వినియోగానికి నూతనంగా అందుబాటులోకి వచ్చిన సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్‌ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు మరింత ఉపయుక్తంగా గ్రంథాలయ సేవలు ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. యూజర్ ఫ్రెండ్లీగా గ్రంథాలయం మార్పు చేయాలన్నారు. రానున్న రెండు నెలల్లో గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి, మెరుగైన సేవలు అందించే దిశగా సిద్ధం చేస్తామన్నారు. తాళపత్రాల డిజిటలైజేషన్, శోధ్‌గంగలో 8వ స్థానం సాధించడం వర్సిటీ ప్రతిష్టను జాతీయ స్థాయిలో పెంచాయన్నారు. ఇందుకు కృషి చేసిన గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. చరిత్ర, ఆర్కియాలజీ విభాగాలలో ఉన్న మరికొన్ని తాళపత్రాలను సైతం గ్రంథాలయం తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. గ్రంథాలయానికి 100 కొత్త కంప్యూటర్లను సైతం అందిస్తామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను అందించిన ఘనత ఏయూ గ్రంథాలయానికి ఉందని, తిరిగి అటువంటి వ్యక్తులను తయారు చేసే దిశగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, టి.శోభశ్రీ, వి.వి జయలక్ష్మి, ఎస్.కె.భట్టి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘నేను ఆ అమ్మాయిని ప్రేమించాను.. కానీ’

దువ్వాడలో కొత్త సినిమా చిత్రీకరణ ప్రారంభం



క్లాప్ కొడుతున్న మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణ, దేవన్‌రెడ్డి

అగనంపూడి: వరలక్ష్మి క్రియేషన్స్ బ్యానర్‌పై బొత్స రామ్, సుమల, మౌర్య కర్ణిక హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న నేను ఆ అమ్మాయిని ప్రేమించాను కానీ.. సినిమా ముహూర్తం షాట్‌ను దువ్వాడ సెక్టార్-1 రామాలయంలో చిత్రీకరించారు. విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి క్లాప్ కొట్టి, ముహూర్తపు షాట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకాదరణ పొంది, మంచి చిత్రంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహాయ నిర్మాతలు గుడివాడ శ్రీనివాసరావు, ఎస్.ఎస్.ఎన్.ప్రసాదరావు, రాజు, నారాయణరావు, పైడిరాజు, విజయ్‌కుమార్, చలపతిరావు, వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, దువ్వాడ సీఐ బి.శ్రీనివాసరావు, మా అసోసియేషన్ కార్యదర్శి వై.అప్పారావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ ఎస్ఐబీ)లో జరుగుతున్న మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ గురువారం ఉదయం తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించడంపై అధికారులను అభినందించారు. అనంతరం ఏయూ సిబ్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న పుస్తకాలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్ ఏడో డాక్టర్ సారాబంది, తదితరులు పాల్గొన్నారు.